ఘనంగా మాతృదినోత్సవం



అన్నదానం చేస్తున్న డాక్టర్లు

రోగులకు అన్నదానం చేసిన కేన్సర్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: సుఖీ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మదర్స్ డే సందర్భంగా వారు బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుఖీ సేవా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ... ప్రతి నెలా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద రోగులకు, రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని తెలిపారు. మదర్స్ డే సందర్భంగా కేన్సర్ ఆస్పత్రి వద్ద సుమారు 800 మందికి అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సాహిత్, రాంబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పుణ్యకార్యం...

లిబర్టీ: పేదల ఆకలిని తీర్చి ధన్యజీవులు కావాలని భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ అన్నారు. ఆకలితో అల్లాడుతున్న వారికి చేయూతనిచ్చినప్పుడే జీవితం ధన్యం అవుతుందన్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేసిన సేవ చిరస్థాయిగా ఉంటుందన్నారు.

తల్లి ప్రేమ ఎంతో గొప్పది

లిబర్టీ: సృష్టిలో మాతృ ప్రేమ ఎంతో గొప్పదని మాతృదేవోభవ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. తల్లిని మించిన దైవం లేదని పేర్కొన్నారు. మదర్స్ డే సందర్భంగా లిబర్టీ ప్లాజాలోని మాతృదేవోభవ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లి నవమాసాలు కడుపులో పెంచి కని పెంచి పెద్ద వారిని చేసి సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాతృమూర్తులను ప్రేమతో చూడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లులను ప్రేమగా చూసి జీవితం సాగించాల్సిన వ్యక్తులు తల్లులను వృద్ధాశ్రమంలో ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తదం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలంటే తల్లి పాత్ర గొప్పదని శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో నేతలు అరుణారెడ్డి, పుష్పాంజలి, నాగిల్ల నవీన్ కుమార్, నందికొండలరావు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రిని బస్సులో తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి
- అడుగడుగునా పటిష్ట బందోబస్తు
- పోలింగ్ ప్రక్రియ మొత్తం నిఘా నీడలోనే...

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఈ రెండు నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ నిర్వహించనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎంలు, వీవీప్యాట్లు తరలించారు.

- యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ (డీఆర్‌సీ) నుంచి బస్సుల్లో పోలీసు బందోబస్తు మధ్య ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు చేర్చి రాత్రి 11 గంటల వరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.
- ఈవీఎంలకు వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు ప్రశాంతంగా జరిగే ప్రక్రియను పూర్తిచేసిన సిబ్బంది పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లపై కూడా దృష్టిసారించారు. విజయభాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ బూత్‌లకు వెళ్లే మార్గాల్లో పోలీసు పికెట్‌లను కూడా ఏర్పాటు చేశారు.
- 24 రూట్ మొబైల్స్ ద్వారా ఈవీఎంల తరలింపు ప్రక్రియ కొనసాగించారు.



పోలింగ్ కేంద్రాలకు బయల్దేరిన పోలింగ్ సిబ్బంది



ఎన్టీఆర్‌నగర్‌ని ఓ పోలింగ్ కేంద్రం

ఖైరతాబాద్‌లో 247 పోలింగ్ బూత్‌లు

మొత్తం ఓటర్లు 2,99,651
పురుషులు 1,55, 352
మహిళలు 1,44,265
ఇతరులు 34

జూబ్లీహిల్స్‌లో 353 పోలింగ్ బూత్‌లు

మొత్తం ఓటర్లు 3,87,056
పురుషులు 2,01,810
మహిళలు 1,85,220
ఇతరులు 22

ముగిసిన శంకర జయంతి వేడుకలు



శంకర జయంతిలో పాల్గొన్న వేద పండితులు, వేద విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీ నగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు ఆదివారం ముగిశాయి. ఆదివారం ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా శ్రీ విజయ శంకర దేశిక వేద పాఠశాల విద్యార్థులు, వేద పండితులు పాల్గొని వేద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అతిపిన్న వయసులోనే వేదాలను, ఇతిహాస పురాణాలను, అష్టాదశ పురాణాలను నేర్చుకొని వాటిని దేశ వ్యాప్తం చేశారని అన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు ఎన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వేద పండితుడు జ్యోతిశ్చంద్ర శర్మ, ఈవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు యువతను పెడదారి పట్టించొద్దు

'గాంజా శంకర్' సినిమా పేరు మార్చండి: వేముల రామకృష్ణ

కాచిగూడ: యువతను పెడదోవ పట్టించే విధంగా సాయిధరమ్ తేజ్ నటించిన 'గాంజా శంకర్' సినిమా పేరును వెంటనే మార్చాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గాంజా శంకర్ సినిమా పేరుపై సినిమా నిర్మాత, దర్శకులు పునరాలోచించాలని ఆయన సూచించారు. ఇలాంటి పదాల వల్ల సమాజంపై ముఖ్యంగా విద్యార్థులు, యువతపై పెనుప్రభావం చూపుతుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పేరున్న పెద్ద హీరోలు సినిమాల్లో ధూమపానం, మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారని, ఈ హీరోలు నేటి యువతకు ఏమి సందేశం ఇవ్వదల్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. కమర్షియల్ సినిమాలు తీయడంలో తప్పులేదని, కానీ మన సంస్కృతి, సంప్రదాయాలలను మర్చిపోయి యువతను పెడదోవ పట్టించే విధంగా ఉన్న సినిమాలు చేస్తే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై సెన్సార్ బోర్డు స్పందించి సినిమా దర్శక, నిర్మాతలకు నోటీసులు అందజేయాలని ఆయన కోరారు.

ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ పట్టు నిలిచేనా?

- సమన్వయంగా సాగుతున్న కాంగ్రెస్ శ్రేణులు
- మెజార్టీ ఇక్కడి నుంచే అంటూ ధీమా



సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ అంటేనే కాంగ్రెస్ కంచుకోట..అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన తరువాత 2018 ఎన్నికల నుంచి ఆయన తన బలాన్ని చాటుకుంటూ ఖైరతాబాద్‌ను బీఆర్ఎస్‌కు కంచుకోటగా మార్చారు. మొన్నటి ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. అయితే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయన పార్టీలో చేరడంతోనే పెద్ద సంఖ్యలో గులాబీ శ్రేణులు కాంగ్రెస్‌లోకి పోటెత్తాయి. కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, నియోజకవర్గ నాయకులతో పాటు కార్యకర్తలు భారీగా కాంగ్రెస్‌లో చేరడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ బలం పుంజుకుంది. దీంతో గతంలో మాదిరిగానే ఖైరతాబాద్‌ను కాంగ్రెస్ కంచుకోటగా మార్చడంలో దానం నాగేందర్ సఫలీకృతం కాగా నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి ఎంతవరకు ఓట్లను సాధిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మొన్నటి ఎన్నికల్లో 22 వేల మెజార్టీతో గెలిచిన నాగేందర్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో కూడా నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 25 వేలకు పైగా మెజార్టీ తీసుకురావాలని తగిన ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. పక్కా పథకంతోనే ఆయన ఎన్నికల బరిలో నిలిచి ఖైరతాబాద్‌లో అందరినీ సమన్వయం చేసుకుంటూ ఇప్పటికే పైచేయి సాధించారు. ఓట్ల రూపంలో ఆయన ఎంతవరకు మెజార్టీ సాధిస్తారో చూడాల్సి ఉంది. ప్రచారంలో సైతం ఆయన అందరి కంటే ముందుండి ప్రతి గడపనూ తాకారు. ఇక్కడ మెజార్టీ సాధించి మిగతా అన్ని నియోజకవర్గాల్లోనూ మెజార్టీ దిశలో దూసుకెళ్లాలని యోచిస్తున్నారు. కుల, మతాలకతీతంగా ఇప్పటికే ఆయనకు భారీ మద్దతు లభించింది. ఇది ఓట్ల రూపంలోకి ఎంతవరకు మారుతుందో చూడాల్సి ఉంది.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్క్ కళాశాల చైర్మన్ ఎ.పరమేశ్వర్

కాచిగూడ: ఇష్టపడి చదివితే విజయాలు వాటంతట అవే వస్తాయని తద్వారా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని ఆర్క్ కళాశాల చైర్మన్ ఎ.పరమేశ్వర్, వైస్ చైర్మన్ ఎ.లక్ష్మీ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని ఆర్క్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శాలిమార్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇష్టపడి చదివినప్పుడే విజయాలు వాటంతట అవే వస్తాయని, తద్వారా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాంప్‌వాక్‌లు, ఫ్యాషన్ షోలు, వెస్టర్న్ డాన్స్‌లు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు ఆధ్యాత్మిక, దేశభక్తి గీతాలు ఆలపించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎ.పరమేశ్వర్ బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత హస్తకళా ప్రదర్శన



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ మేళాలో పట్టు చీరలు, ఫ్యాన్సీ, డిజైనర్, పోచంపల్లి, డ్రెస్ మెటీరియల్స్, చూడీదార్స్, షూటింగ్స్, షర్టింగ్స్, జ్యువెలరీ,బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వినోద్‌జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాం సిల్క్, బగల్పూర్ సిల్క్, కర్ణాటక గ్రేడ్స్ ప్రింటెడ్ చీరలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, రాజస్థాన్ కోట బంధా, బ్లాక్ ప్రింట్స్, గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి, జిందాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. హరియాణా బెడ్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టెన్స్, జైపూర్ స్టోన్స్, ఒరిస్సా పెయింటింగ్స్ అండ్ క్రాఫ్ట్స్‌తో పాటు గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు అందుబాటులో ఉన్నాయన్నారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరికి అందుబాటు ఉండేలా ధరలు ఉన్నాయని వివరించారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా అందుబాటులో ఉంటుందన్నారు.

ఊ అంటారా.. ఊహూ అంటారా?

ఓటరు తీర్పుపై సర్వత్రా ఆసక్తి!

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజవర్గ ఓటర్లు ఎలాంటి తీర్పునిస్తారోననే ఆసక్తి ఆ పార్టీ నేతల్లో నెలకొంది. 2014, 2019 మాదిరిగా బీజేపీని ఆదరిస్తారా..? ఒక ఊపు మీద ఉన్న కాంగ్రెస్‌పై కనికరం చూపిస్తారా? అన్న దానిపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. 2019 ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఘన విజయం సాధించగా ఆ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థికి 58,885 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి 45,270, కాంగ్రెస్ అభ్యర్థి 26,564 ఓట్లు వచ్చాయి. 2023 నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పైచేయి సాధించగా, రెండో స్థానంలో కాంగ్రెస్, మూడో స్థానంలో బీజేపీ నిలిచాయి. 2020లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నాలుగు డివిజన్లు బీఆర్ఎస్ గెలుచుకోగా, రెండు డివిజన్లు బీజేపీ గెలుచుకుంది. ఇలా ప్రతి ఎన్నికలోనూ ఖైరతాబాద్ ఓటర్లు భిన్నమైన తీర్పులు ఇస్తూ ఆయా పార్టీల నేతలను ఆందోళనకు గురిచేస్తున్నారు. నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో నన్నది చర్చనీయాంశమైంది. పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ తన పట్టును ఎంతవరకు నిలుపుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత



భద్రతను పరిశీలిస్తున్న వెస్ట్ జోన్ అదనపు డీసీపీ హనుమంతరావు

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కిందికి వచ్చే ఖైరతాబాద్, జుబ్లీహిల్స్ నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూములకు సాయుధ బలగాలతో కూడిన పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఈ రెండు నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ బూతులకు ఈవీఎంలను పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం ఏడు గంటల తర్వాత పోలింగ్ అనంతరం తిరిగి ఈవీఎంలను ఇక్కడే భ్రపరచనున్నారు. ఇందు కోసం స్టేడియం చుట్టూ ఐదు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఆదివారం ఇక్కడ భద్రతను వెస్ట్ జోన్ అదనపు డీసీపీ హనుమంతరావు, బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్ రెడ్డి పరిశీలించారు. స్టేడియం చుట్టూ పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. స్టేడియం లోపలికి అనుమతి లేకుండా ఎవరినీ రానివ్వడం లేదు. పాసులు ఉన్న వారు మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. సాయుధ బలగాలను స్ట్రాంగ్ రూముల వద్ద మోహరించారు. స్టేడియం చుట్టూ 40 మంది పోలీసులు పహారా కాస్తున్నారు.

ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా



కవాడిగూడ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కృషి చేస్తున్నదని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఐవీఎఫ్ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు వారిచే ప్రమాణ స్వీకరాం చేయించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగాలలో రాణించేలా ఐవీఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ఐవీఎఫ్ యువజన కమిటీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్య పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆర్థిక సాయం అందించడంతోపాటు బాలబాలికలకు ఉచితంగా వసతి గృహాలను సైతం ఏర్పాటు చేసిందన్నారు. పుణ్యక్షేత్రాల వద్ద వసతి గృహాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కృషిచేస్తున్నదన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ కమిటీ సలహాదారుడు సత్తయ్య, కోశాధికారి నారాయణ, అడిషనల్ సెక్రటరీ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, యువజన కమిటీ అధ్యక్షుడు రవిందర్, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సాయుధ బలగాలు



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్ పోలింగ్ బూత్ వద్ద సాయుధ బలగాల పహారా

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ యంత్రాంగం తగిన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా బందోబస్తు నిమిత్తం పోలీసులను రప్పించారు. వెస్ట్‌జోన్ పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 68, జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 151 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్ సాయుధ బలగాలను బందోబస్తులో ఉంచారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట గేటు వద్ద ఇద్దరు, పోలింగ్ బూత్ వద్ద ఇద్దరు పహారా కాయనున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో మొత్తం 5 వేల మంది పోలీసులు పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు వెళ్లేదారిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు పోలీస్ పెట్రోలింగ్ ముమ్మురం చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే పోలింగ్ బూత్‌లను పోలీసులు తమ ఆదీనంలోకి తీసుకున్నారు. అనుమానితుల కదలికలపై అయా పోలిస్ స్టెషన్ల పరిధిలో పెట్రోలింగ్, బ్లూకోట్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

ఇక్ఫాయ్ డైరెక్టర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్‌రావు

బంజారాహిల్స్: విద్య, మార్కెటింగ్ బ్రాండింగ్ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్‌రావుకు పూణెలోని ప్రతిష్టాత్మక ఎంఐటీ (మిట్) ఆర్ట్ డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ సీకే ప్రహ్లాద్ చైర్ అవార్డును అందజేసింది. డిజైన్ థింకింగ్‌ను ఇటీవల మార్కెటింగ్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సుదర్శన్‌రావు చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిస్తూ ఈ అవార్డు అందజేశారు. మిట్ యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత కరాడ్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ మంగేష్, ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్ డి.కరాడ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. తనకు ఈ అవార్డు లభించడం ఆనందంగా ఉందని, తనపై బాధ్యత మరింత పెరిగిందని సుధాకర్‌రావు అన్నారు.

సంప్రదాయ సంగీతాన్ని భావితరాలకు అందించాలి



శివపార్వతిని సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: సంస్కృతికి ప్రధానమైన సంప్రదాయ సంగీతాన్ని పరిరక్షిస్తు భావితరాలకు అందించాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులుపై ఉందని వివిధ రంగాల ప్రముఖులు కోరారు. ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శాస్త్రీయ సంగీత గురువు చిల్ల శివ పార్వతి జన్మదిన సందర్భంగా ఆమె శిష్య బందం గానం, నాట్య గురువు జ్యోతి శేఖర్ శిష్యురాలు గాయత్రి శేఖర్ కూచిపూడి నాట్య ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా కళా పోషకుడు గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. శివ పార్వతి ఎందరో ఔత్సాహికులకు సంప్రదాయ సంగీత నేర్పిస్తూ వారిని ఉత్తమ గాయకులుగా సమాజానికి అందిస్తున్నారని అభినందించారు. శ్రీ రామసాంస్కతిక సంస్థ స్థాపకుడు గొర్తి చంద్రశేఖర్, ప్రముఖ గాయకుడు త్రినాథరావు, శేఖర్‌లను అభినయ నాట్య మంజరి బిరుదుతో సత్కరించారు.

ముస్లిం రిజర్వేషన్ల రద్దు లౌకికవాదానికి విరుద్ధం

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర విధానానికి పూర్తి విరుద్ధమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మన దేశం లౌకిక ప్రజాస్వామ్య దేశమని చెప్పుకున్నప్పటికీ ప్రధానమంత్రి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. అన్ని వర్గాలకు, అన్ని మతాలకు సమానమైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ సాక్షాత్తు దేశ ప్రధాని ఈ విధంగా మత రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణలో ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావని, ముస్లింలలో ఉన్న పలు ఉపకులాలు, ప్రాతినిధ్యం లేని వర్గాలకు ఇస్తున్నవని పేర్కొన్నారు. సంపద ఉన్న వర్గాలను తొలగించి అర్హత కలిగిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు.

వేలిపై సిరా చుక్క.. కంప్యూటర్ కోర్సులో 80శాతం రాయితీ పక్కా

కాచిగూడ: ఓటు వేయండి.. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో 80 శాతం రాయితీతో శిక్షణ పొందండి అంటూ పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం ప్రకటించింది. యువతలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు, ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఈ రాయితీని ప్రకటించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. 80 శాతానికి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటు వేసిన సిరా గుర్తు గల వేలిని చూపిస్తూ సెల్ఫీ దిగి వాట్సాప్ నెంబర్ సెల్: 9505800047 కు పంపిన యువతీ యువకులకు, విద్యార్థులకు కోర్సు ఫీజులో 80 శాతం రాయితీ కూపన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ కోర్సుల వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పంపడం జరుగుతుందన్నారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తమ తమ పిల్లలతో పలు కుటుంబాలు కోటకు తరలివచ్చాయి. కోటలోని నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో తదితర ప్రాంతాల వద్ద పిల్లలు సందడి చేస్తూ ఆటలు ఆడుకున్నారు. పలువురు యువ జంటలు క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగి వద్ద సెల్ఫీలు దిగారు. రామభక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు బందీఖానాను సందర్శించి భక్త రామదాసు చరసాలను సందర్శించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్: ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ ఎస్ఐ రవీందర్ సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నెం.12 సమీపంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిసున్నట్లు సమాచారం అందుకున్నారు. ఎం.రమేష్ (25) అనే వ్యక్తి మరో ఇద్దరు మధ్యవర్తుల సాయంతో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో అక్కడి చేరుకొని టీఎస్07ఎఫ్‌యూ 2630 అనే బైక్ పై మద్యం తరలిస్తుండగా అతన్ని పట్టుకొని తనిఖీ చేశారు. అతను స్థానిక వైన్ షాపు నుంచి 24 బాటిళ్ల బీర్లు(రెండు కాటన్ల బీర్లు) విక్రయించి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతన్ని అరెస్ట్ చేసి, మద్యం సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవీందర్ వెల్లడించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203